# 7

# మీరు అగౌరవపరచబడినప్పుడు

## (మత్తయి 5:38-42)

కొండమీది ప్రసంగంలో మన తరువాతి భాగమైన మత్తయి 5:38–42లో ప్రజలు మునుపు విన్న విషయాలకు అలాగే యేసు ప్రభువు బోధిస్తున్న విషయాలకు మధ్య గల వ్యత్యాసాలలో మరియొక దాన్ని మనం చూస్తాం. ఈ వ్యత్యాసం మరియు చివరిది కూడ కొంచెం సంబంధితమైనవి ఉన్నాయి. ఈ రెండూ కూడ మనం అగౌరవపరచబడినప్పుడు, మనం ఏ విధంగా స్పందించాలన్న విషయాన్ని తెలియజేస్తున్నాయి.[1] ఈ కొండమీది ప్రసంగంలోని అన్ని అంశాలకంటే కూడ ప్రస్తుత వాక్య భాగం ఎంతో వివాదాస్పదమయింది.

> "కంటికి కన్ను, పంటికి పల్లు అని చెప్పబడిన మాట మీరు విన్నారుగదా, నేను మీతో చెప్పునదేమనగా, దుష్టుని ఎదురింపక, నిన్ను కుడి చెంపమీద కొట్టువాని వైపునకు ఎడమ చెంపకూడ త్రిప్పుము. ఎవడైన నీ మీద వ్యాజ్యము వేసి నీ అంగీ తీసుకొనగోరిన యెడల వానికి నీ పై వస్త్రము కూడ యిచ్చివేయుము. ఒకడు ఒక మైలు దూరము రమ్మని నిన్ను బలవంతము చేసిన యెడల వానితో కూడ రెండు మైళ్ళు వెళ్ళుము. నిన్ను అడుగువానికిమ్ము. నిన్ను అప్పు అడగగోరువానినుండి నీ ముఖము త్రిప్పుకొనవద్దు" (మత్తయి 5:38–42).

డి. మార్టెన్ లాయిడ్ జోన్స్ ఈ విధంగా వ్రాస్తున్నాడు, "దుష్టుని ఎదురించకుండా ప్రేమించి రక్షించుమని వివాదాస్పద బోధను అందిస్తున్న ఇటువంటి వాక్య భాగం లేఖనాలలో మరెక్కడా లేదు"[2] అని ఆయన వ్రాస్తున్నాడు. ఈ వాక్య భాగాన్నే ఆధారం చేసుకుని క్రైస్తవ విశ్వాస వ్యతిరేకులు ప్రభువు యొక్క బోధనలు చాదస్తమైనవి అని, అసాధ్యమైనవని చెప్తున్నారు. అలాగే యేసును వెంబడించాలని ఆశించే వారిని కూడ యివి కలవరపాటుకు గురిచేస్తున్నాయి. యిది మన జీవితాలకు ఎంతవరకు అన్వయించబడుతుంది? చాలా మంది క్రైస్తవులు ఈ వాక్యభాగంలోని ఉపదేశమును విస్మరిస్తారు లేదా దానిని విడిచి పెట్టేస్తారు. వాక్యోపదేశమును విస్మరించకుండా, దాని అసలు ఉపదేశమును మీ ముందుంచడమే నా ముందున్న సవాలు.

"మీరు అగౌరవపరచబడినప్పుడు ..." అన్న శీర్షికను ఈ పాఠమునకు పెట్టాను. యితరుల చేత ఒక దేవుని కుమారుడు అగౌరవపరచబడినప్పుడు ఏ విధంగా స్పందించాలి? ఈ పాఠములో, ప్రాథమికంగా అడుగబడిన ప్రశ్నకు ప్రభుని నకారాత్మక జవాబును చూస్తున్నాం (ఏం చేయ*కూడదు*). తరువాతి పాఠములో, ఆయన అనుకూలంగా చెప్పిన సకారాత్మక జవాబును చూస్తాము (ఏం చేయవచ్చు).

### వారు ఏమని బోధింపబడ్డారు (5:38)

అక్కడి ప్రజలు మొదటిగా విన్న బోధను గురించి యేసు ప్రభువు ఉదహరిస్తున్నారు: "కంటికి కన్ను, పంటికి పల్లు అని చెప్పబడిన మాట విన్నారు గదా" (38 వచనం).

పాత నిబంధనలో యిది చాలా ప్రాముఖ్యమైన వచనం. బైబిలు గురించి తెలియని వారికి సహితం పరిచయమున్న వాక్యం యిది. పాత నిబంధనలో మూడు మార్లు యిటువంటి పదాలున్నాయి: నిర్గమకాండము 21:22-25; లేవీయకాండము 24:19, 20; మరియు ద్వితీయోపదేశకాండము 19:21. "నీవు ఎవనిని కటాక్షింపకూడదు, ప్రాణమునకు ప్రాణము. కంటికి కన్ను, పంటికి పల్లు, చేతికి చేయి, కాలికి కాలు మీకు విధి" అని ద్వితీయోపదేశకాండము 19:21లో ఉంది.

**ఈ ఆజ్ఞ ఎందుకు ఇయ్యబడింది**

వ్యక్తిగత కక్షనుండి కుటుంబ కలహాలు, సమాజంలోని అనైతికత వరకు ఉన్న ప్రతి విషయాన్ని మన్నించేదిగా ఈ మాటలు చెప్పబడ్డాయి. యిందుకోసమేనా దేవుడు ఈ ఆజ్ఞను యిచ్చిరా? కానేకాదు. ఈ విషయం గూర్చి అనేక విషయాలను మనం అర్థం చేసుకోవాలి. మొదటిగా, యిది *కక్షను* తీర్చుకొనుటకు యియ్యబడలేదు గాని (జాగ్రత్తగా గమనించండి) శిక్షను *తగ్గించడానికి* ఇయ్యబడింది. ఒకవేళ ఒక వ్యక్తి గొడవలో తన కన్నును పోగొట్టుకొనినట్ట యితే, అతడు కక్షతో దాడిచేసి, అపరాధి వ్యక్తి యొక్క రెండుకళ్ళను, వీలయితే అతడి ప్రాణమును కూడ తీయుటకు వెనుకాడడు. ఒక్కొసారి ఈ పగ, కక్షలు ఎంత తీవ్రస్థాయికి చేరుకుంటా యంటే, కొన్ని కుటుంబాలు లేదా గ్రామాలు లేదా దేశాలు ఈ పగకు బలవుతుంటాయి. కంటికి కన్ను అనే ఆజ్ఞను గురించి ఆలోచిస్తున్నప్పుడు, యిలా గమనించండి: "ఒక కన్నుకు *కేవలం* ఒక కన్ను. ఒక పన్నుకి *కేవలం* ఒక పన్నే, అంతకు మించకూడదు."

రెండవదిగా, ఈ మాటలు సగటు ఇశ్రాయేలీయుడికి ఉద్దేశించబడినవి కావు గాని న్యాయస్థానంలోని న్యాయాధిపతి స్థానంలోని అధికారికి సంబంధించి ఉద్దేశించినవి. ఇంతకుముందు మనం గమనించిన ద్వితీయోపదేశకాండము 19:21 వాక్యభాగాన్ని మరలా చూద్దాం. ఈ వచనం ముందున్న వచనాలను గమనించండి. వివాదము గల యిద్దరు మనుష్యులను గురించి 17వ వచనంలో చూస్తాం. వారు "యెహోవా సన్నిధిని, అనగా ఆ కాలములోనున్న యాజకుల యెదుటను న్యాయాధిపతుల యెదుటను నిలువవలెను." ఆ న్యాయాధిపతులు వారిని బాగుగా విమర్శించుతారని 18వ వచనం తెలియజేస్తుంది. వారు న్యాయ తీర్పును ఏవిధంగా వెలువరించాలన్న విషయం గురించి తరువాతి వచనాలలో చూస్తాం, "కంటికి కన్ను, పంటికి పల్లు" అన్న న్యాయవిధి కూడ తీర్పులోని ఒక భాగం. యిది ఒక ప్రాథమిక న్యాయసిద్ధాంతము - నేరమునకు తగిన శిక్ష.

కంటికి కన్ను లేదా పంటికి పన్ను అను ఈ శిక్షను యధావిధిగా అమలుపరచిన విషయం మనకెక్కడా కనబడలేదు గాని, యేసు కాలం వచ్చేసరికి నేరము తగిన అపరాధ రుసుమును చెల్లించడం శిక్షగా వ్యవహరించబడుతూ వచ్చింది.[3] (కన్ను లేదా పన్ను లేదా మరేదయినా). శిక్షను అనుభవించువారు ఈ రుసుమును చెల్లించాలి )ఈ పద్ధతి ఈ నాడు ప్రస్తుత న్యాయస్థానాల్లోనూ జరుగుతుంది).

**ఈ ఆజ్ఞ ఏవిధంగా దుర్వినియోగపరచబడింది**

"కంటికి కన్ను" అను ఈ ఆజ్ఞ "సార్వత్రికం కాదు గాని షరతులతో కూడినది."[4] వ్యక్తిగత కక్షను మోషే ధర్మశాస్త్రం ఏనాడు ప్రోత్సహించలేదు. మనలో అనేకమందికి లేవీయకాండము

19:18లోని మాటలు బాగుగా తెలుసు: "నిన్నువలె నీ పొరుగువారిని ప్రేమింపవలెను." కానీ, దీని ముందున్న మాటలను గమించండి "కీడుకు ప్రతి కీడు చేయకూడదు. నీ ప్రజలమీద కోపముంచుకొనకూడదు ... ." దీన్ని విస్మరించి "కంటికి కన్ను" వాక్య భాగాన్ని తీసుకుని దేవుడు వ్యక్తిగత ప్రతీకారేచ్ఛలకు అనుకూలమనే వాదనను యూదులు విన్పిస్తున్నారు.

ఈ నాడు కూడ మన మధ్యలో ఈ వాక్య భాగం దుర్వినియోగపరచబడుతుంది. ప్రతీకారం కోసం తహతహలాడే మూర్ఖ ప్రజలు యితరులను హింసిస్తూ, "పరిశుద్ధ గ్రంథం చెప్పే సారాంశం యిదే. కంటికి కన్ను పంటికి పన్ను" అని జనులను ప్రక్కదోవ పట్టిస్తున్నారు.

## యేసు ఏం చెప్పారు (5:39-42)

### ఒక షరతు (39ఎ వచనం)

పాత నిబంధన యొక్క ఉపదేశమును దుర్వినియోగపరచబడడం గురించి యేసు యిలా ప్రతిస్పందిస్తున్నారు - "నేను మీతో చెప్పునదేమనగా, దుష్టుని ఎదురింపక[5] ..."[6] (39ఎ వచనం). వాక్య ప్రారంభంలోనే మనం వివాదాస్పద మాటలతో ఆరంభిస్తున్నాం - "దుష్ట వ్యక్తిని ఎదురింపకూడదా? చెడ్డ మనుష్యులు వారికిష్టము వచ్చినట్టుగా ప్రవర్తిస్తుంటే చూస్తూ ఊరుకోవాలా? ఈ సమాజాన్ని భ్రష్టుపట్టిస్తుంటే అలాగే వదిలివేయాలా?" "యిది మంచి పద్ధతి కాదు?" ప్రభుని మాటలను తేలిక చేయకుండా వాటి అంతరార్థాన్ని గమనించుదాం.

మొదటిగా ప్రభువు ఈ మాటలను సార్వత్రిక సమాజానికి గాక, కేవలం శిష్యులను ఉద్దేశించి మాత్రమే చెబుతున్నాడు.

- పిల్లల గురించి తల్లిదండ్రులతో ఈ మాటలను చెప్పడం లేదు. పిల్లలోని దుష్ట క్రియలు, అల్లరి పనులను సత్వరమే పోగొట్టాలి. (క్రమశిక్షణ అవసరం. హెబ్రీయులకు 12:8, 11 చూడు.)
- ఈ మాట ఆయన ప్రభుత్వాన్ని ఉద్దేశించి చెప్పడం లేదు. "తప్పు చేసినవారిపై, దుష్టపనులు చేస్తున్నవారిపై" చర్యలు తీసుకొనడానికి ప్రభుత్వ అధికారులకు హక్కు ఉంది (రోమీయులకు 13:4).
- అలాగే స్థానిక సంఘాన్ని ఉద్దేశించికూడా ఆయన ఈ మాటలు తెలియజేయడం లేదు. అబద్ధ బోధకులను తరిమి వేయాల్సిందే (మత్తయి 7:15 చూడు). అబద్ధ బోధకులను ప్రోత్సహించువారు "వారి దుష్ట క్రియల్లో పాలు పొందుతున్నవారు" (2 యోహాను 11). అలాగే పాపములోనున్న సంఘస్థులను సంఘం క్రమపరచాలి (మత్తయి 18:15-18 చూడు).

తల్లిదండ్రుల గురించి, ప్రభుత్వం గురించి, లేక సంఘ నాయకుల గురించి గాకపోతే మరి ఎవరి గురించి ప్రభువు ఈ మాటలను చెబుతున్నారు? ప్రభుని శిష్యులముగా మన ఒక్కొక్కరితో వ్యక్తిగతంగా ఆయన ఈ మాటలను చెబుతున్నారు. మనం సమాజంలో, వ్యక్తిగతంగా హీన పరచబడుతున్నప్పుడు మనం ఏవిధంగా ప్రతిస్పందించాలన్న విషయాన్ని గురించి ఆయన ఈ మాటలను తెలియజేస్తున్నాడు.

"వ్యక్తిగతంగా" అను మాటను మీ మనసులో గుర్తుంచుకోండి. ఒక చెడ్డ మనుష్యుడు

చట్టాన్ని అధికమిస్తున్నా లేక, యితరులను బాధపెడుతున్నా, హించుచున్నా, హద్దుమీరుతున్నా, ఆ వ్యక్తిని అడ్డుకోవద్దని ప్రభుని ఉద్దేశం కాదు. ఉదాహరణకు, మీ పిల్లవాడిని ఎవరైనా కొడుతుంటే, కేవలం మీరు చూస్తూ ఉండిపోవాలని ఆయన కోరుకోవడం లేదు. మనకు ఉన్నటువంటి హక్కులను బట్టి దుష్టుని మనం ఎదురించాలి.

యేసు కూడ వ్యక్తిగతంగా దుష్టుని, చెడ్డ మనుష్యులను ఎదురించాడు. దేవాలయమును పాడుచేస్తున్నవారిని రెండు సందర్భాలలో ఆయన ఎదిరించాడు (యోహాన 2:13–17; మత్తయి 21:12, 13 చూడు). వేషధారణ చేసే చెడ్డ వ్యక్తులను చూచి ఆయన వారిని ఖండించాడు (మత్తయి 23). అపొస్తలుడైన పౌలు కూడ దుష్టుని, దుష్ట మనుష్యులను ఎదిరించాడు.[7] ఒక సందర్భంలో పేతురు అపరాధిగా ఎంచబడినప్పుడు పౌలు అతనిని "ముఖాముఖిగా ఎదురించాడు" (గలతీయులకు 2:11). "ఎదురించుట" అను మాట యొక్క మూల గ్రీకు పదం మన వాక్య భాగంలోని "ఎదురింపక" అను మాట యొక్క గ్రీకు పదము ఒకటే. యేసు మరియు పౌలులు వ్యక్తిగతంగా అగౌరవపరచబడ్డారన్న విషయంలోగాక వారికున్న హక్కు ప్రకారం దుష్టుని, దుష్ట మనిష్యులను ఎదురించారు.

ప్రభువు తన మనస్సులోనున్న విషయాన్ని ఈ ఉదాహరణల ద్వారా వ్యక్తపరుస్తున్నారు – చెంపను చూపించడం, అంగీని యివ్వడం, రెండు మైళ్ళు వెళ్ళడం.[8] యివేవీ మనలను హీనం చేసేవి కాదుగాని, అన్నీ వ్యక్తిగతమైనవి, మన "హక్కులని" వేటిని ఆలోచించుచున్నామో వాటిని అలక్ష్యం చేసేవి.

### నాలుగు ఉదాహరణలు (39బి–42 వచనాలు)

ఈ ఉదాహరణలను పరిశీలిస్తుండగా, వాటి వెనుకనున్న సూత్రము గురించి మనం ఆలోచిద్దాం. ఒక క్రైస్తవుడు ఎలా జీవించాలన్న విషయంలోని అంశాలలో వీటిని కూడ అంశముల లెక్కలో కొంతమంది చేర్చి చూపిస్తుంటారు. ఆరు దశబ్దాల నా క్రైస్తవ జీవితంలో, ఎవరూ కూడ నా కుడి చెంపపై కొట్టలేదు, నా మీద గొడవ వేసి నా వస్త్రాన్ని ఎవరూ తీసుకొనలేదు. అలాగే ఎవరూ కూడ మరొక మైలు దూరం నడుద్దాం రమ్మని నన్ను బలవంతపెట్టలేదు. ఒకవేళ వీటివెనుక ఏ సూత్రము లేదా విషయం లేనట్లయితే, నా అనుదిన జీవితంలో అన్వయించుకొనవలసిన విషయం ఒకటి ఉండిఉండవచ్చు. ఇందును గురించి బి. డబ్ల్యూ. జాన్‌సన్ ఒక మాట చెప్తున్నారు, యేసు చెప్పిన ఈ ఉదాహరణలు "తప్పనిసరిగా పాటించదగ్గ" ఆజ్ఞలు కావు. గాని, "పాటించ దగ్గ" ఒక సూత్రము లేదా ముఖ్య విషయం ఒకటి యిందులో ఉంది.[9] ఆ సూత్రము ఏమిటి?

(1) "మరొక చెంపను చూపించండి." 39వ వచనం చివరి భాగంలో మొదటి ఉదాహరణ కనబడుతుంది: "నిన్ను కుడి చెంపమీద కొట్టువాని వైపునకు ఎడమచెంపకూడ త్రిప్పుము." చెంపదెబ్బ కొట్టడం అవమానమును సూచిస్తుంది.[10] మన వాక్య భాగంలో చెప్పబడిన చెంపదెబ్బ అధిక అవమానమును సూచిస్తుంది. ఎందుకంటే ఈ చెంపదెబ్బను చేతి వెనుక భాగంతో కొడుతాము. (మన ఎదురుగావున్న వ్యక్తిని చెంప దెబ్బ కొట్టాలంటే, మన అరచేతితో ఆ వ్యక్తిని కొడితే అతడి ఎడమ చెంపమీద కొట్టగలగుతాము. అయితే అతడి కుడి చెంపను కొట్టాలంటే చేతి వెనుక భాగంతోనే కొట్టగలుగుతాము.) చెంప దెబ్బ కొట్టడం గురించి మాట్లాడుకుంటున్నాము. గట్టిగా కొడితే దెబ్బ తగులుతుంది కానీ, దీంతోనే మరణం

సంభవించదు.

ఒకరు మనలను చెంప దెబ్బ కొట్టినప్పుడు మనం ఏం చేయాలి? "మరో చెంపకూడా చూపించమని" యేసు చెప్తున్నారు. దీన్ని ఆధారం చేసుకుని, "నిజమైన ప్రపంచంలో" సరైన విధానాన్ని క్రైస్తవ్యం అనుసరించ లేకపోతుందని విమర్శకులు పేట్రేగిపోతుంటారు. "దీన్ని అనుసరించే వెన్ను లేని చేతగాని వారు యితరులను తమ వైపు త్రిప్పుకోవడానికి పరుగెత్తుతారు" అని వారు, గేలిచేస్తుంటారు. ఈ లోక రీతికంటె, ప్రభుని మాటలు విభిన్నమైనవని మనం గుర్తెరగాలి. "యథార్థవంతుడైన వ్యక్తి తన గౌరవాన్ని ప్రతి పరిస్థితుల్లోనూ కాపాడుకుంటాడని" ఒక నానుడి ఉంది. సాధారణంగా చెంపదెబ్బ కొట్టడమంటే, యిద్దరు వ్యక్తులు కొట్టుకుని చావడమే.

యేసుని మాటల నెరవేర్పు కొరకు క్రైస్తవులు ఎంతో శ్రమించాలన్న విషయాన్ని మనం అర్థం చేసుకోవాలి. మనలను యితరులు అలుసుగా తీసుకుని చులకన చేసేలా ప్రభువు ఈ మాటలను బోధించారా? తమను తాము ఏవిధంగా రక్షించుకోవాలో తండ్రులు పిల్లలకు చెప్పే సమయంలో దీన్ని బట్టి వారు పునరాలోచనలో పడతారు.[11] కొంతమంది క్రైస్తవులు ప్రభుని మాటలను అక్షరార్థముగా తీసుకుంటారు. ఒకతను యిలా చెప్తున్నాడు. "అలాగలాగే, వాడునన్ను ఒక చెంపమీద కొట్టగానే, రెండవ చెంప మీద కొట్టనిస్తాను. తరువాత మీరెన్నడూ చూడనటువంటి పెద్ద ముష్టి యుద్ధాన్ని మీరు చూస్తారు." ప్రభువు యొక్క బోధనలోని ముఖ్యాంశాన్ని ఈయన గుర్తెరగలేదు.

ఈ ఉదాహరణ మరియు మిగిలిన ఉదాహరణల వెనుకనున్న సూత్రముగా నేను భావించే విషయాన్ని మీ ముందుంచుతున్నాను. యింతకు ముందు చెప్పుకున్న విధంగానే, చెంపదెబ్బ కొట్టడమంటే, *అవమానపరచడమే*. అవమానమనేది మనసుకు సంబంధించినది. యిక్కడ తగిలే దెబ్బ శరీరానికి కంటే, ఒక వ్యక్తి యొక్క గౌరవానికి తగులుతుంది. మీరు అవమానపరచబడినప్పుడు మీకు ఎలా ఉంటుంది? ఎలా ఉంటుందో నాకు తెలుసు. నరాల్లో ఒక్కసారిగా రక్తం పొంగుతుంది. ముఖం ఎర్ర బారుతుంది. దీనికి కారణమయిన వారిని కొరడాతో కొడదామన్న కోపం వస్తుంది. ఆ సంవత్సరాల్లో జరిగిన సంఘటనలు, చేసిన పనులు గుర్తు చెచుకోవాలనిపించదు. నేను ఎందుకిలా ప్రవర్తించాను? ఎందుకంటే అవమానం అనేది మానసికమైనది. ఎవరో నా భావాలను దెబ్బతీశారు కాబట్టి నేను కలత చెందాను.

అవమానమునకు కలిగే మన స్పందన గురించి వివరిస్తున్నప్పుడు నేను వాడిన "నేను," "నా," "వ్యక్తిగతంగా" అను మాటలను గమనించారా? యేసు ప్రభువు చెప్పిన ఉదాహరణల్లో అంతర్లీనంగా కనిపించే సూత్రము యిదే. *నీ గురించి నీవు అధికంగా ఆలోచించకు.* మీ "హక్కుల" గురించి ఎక్కువగా ఆలోచించకండి. యేసు ప్రభువు యిదే విషయాన్ని తెలియజేస్తున్నారు. ఎవడైనను నన్ను వెంబడింపగోరిన యెడల తన్నుతాను *ఉపేక్షించుకుని,* తన సిలువనెత్తికొని నన్ను వెంబడింపవలెను (మత్తయి 16:24; నొక్కి చెప్పింది నాది).

శ్రమల సమయంలో, యేసు తన హృదయంలో పడిన వేదనను తెలియజేస్తున్నారు. యితర శ్రమలను ప్రక్కనబెడితే, యేసును చెంప దెబ్బ కూడకొట్టారు (మార్కు 14:65 చూడు). ఒక సమయంలో యిదే అనుభవం ఎదురయినప్పుడు యేసు ఎదురు ప్రశ్నించారు (యోహాను 18:19–23 చూడు); ఆయన ఎదురు తిరగ గలిగినా గాని ఆయనావిధంగా

చేయలేదు (మత్తయి 26:53 చూడు). పేతురు ఈ విధంగా వ్రాస్తున్నారు,

> క్రీస్తు కూడ మీ కొరకు బాధపడి, మీరు తన అడుగు జాడలయందు నడుచుకొనునట్లు మాదిరి యుంచిపోయెను. ఆయన పాపము చేయలేదు; ఆయన నోటను ఏ కపటమును కనబడలేదు. ఆయన దూషింపబడియు బదులు దూషింపలేదు; ఆయన శ్రమపెట్టబడియు బెదిరింపక, న్యాయముగా తీర్పు తీర్చు దేవునికి తన్నుతాను అప్పగించుకొనెను (1 పేతురు 2:21–23).

"ఒకవేళ నేను నా రెండువ చెంపను త్రిప్పితే, నేను చేతకానివాడినని ప్రజలు భావిస్తారు గదా!" అని ఒకరు అనవచ్చు, కావచ్చు. అయినా గాని, మీరు చేసిన పని మిమ్ములను అవమానపరచిన వ్యక్తుల హృదయాలను కదిలింపవచ్చు. కొన్ని సంవత్సరాల క్రితం, గొప్ప బోధకులు అయిన మార్షల్ కీబల్ గురించిన కథను విన్నాను. ఒకసారి ఆయన తన ప్రసంగాన్ని ముగించిన తరువాత, తీర్మాన పిలుపును అందుకుని వస్తున్న వారిని పరికరిస్తూ అడిటోరియంలో తిరుగుతున్నారు. ఒక వ్యక్తి కిటికి దగ్గరినుండి దురుసుగా వచ్చి కీబల్‌ను సమీపించాడు. కీబల్ ఆయన చేతిని అందుకుని నవ్వుతూ పలకరించబోయాడు. అయితే ఆ వ్యక్తి కీబలను ప్రభువుబల్ల దగ్గరకు తోశాడు. కీబల్ ముఖం మీద ఉమ్మి వేశాడు. అయితే కీబల్ అతడిని చూచి "నా ముఖం మీదున్న ఉమ్మిని తుడిచివేచినంత సులభంగా మీ మనసులోని కోపాన్ని, మీ హృదయంలోని పాపాన్ని తుడిచి వేయగలిగితే ఎంత బాగుండు" అని అన్నాడు. వెంటనే అవతలి వ్యక్తి మోకరిల్లి కన్నీటి పర్యంతమయ్యాడు. అతడు సువార్తను అంగీకరించాడు. కాని మనం మరో చెంపను చూపిస్తే మార్చినా, మార్చక పోయినా యిది మాత్రం మనల్ని మరింత మంచివారుగా తయారు చేస్తుంది.

(2) "నీ అంగీని కూడా ఇచ్చివేయుము." రెండవ ఉదాహరణ న్యాయస్థానానికి సంబంధించినది.[12] ఎవడైన నీ మీద వ్యాజ్యము చేసి నీ అంగీ తీసుకొనగోరిన యెడల వానికి నీ పైనున్న వస్త్రం కూడ ఇచ్చివేయుము" (40 వచనం). యేసు చెప్పిన మాటలు 21 శతాబ్దపు ప్రజలకు అర్థం కావలన్న ఉద్దేశంతో NASB "చొక్కా" మరియు "కోటు" అను పదాలను ఉపయోగించింది.[13] కాని యిదే పదాలను యేసు ఉపయోగించలేదు. చొక్కా అను మాట *chiton* అను పదంనుండి వచ్చింది. ఇది లోదుస్తులను సూచిస్తుంది.[14] ఇది శరీరం మీద వేసుకునేది. మెడ భాగంనుండి మోకాళ్ళ వరకు ఇది ఉంటంది. దీనినే "అంగీ" అని పిలుస్తారు. పై వస్త్రం "coat" (*himation*) పైన ధరించే వస్త్రాన్నే సూచిస్తుంది.[15] పేదవారు దీనిని రాత్రుళ్ళో దుప్పటిగా వాడుతారు. యిటువంటి వస్త్రాన్ని కుదువ పెట్టినట్టయితే,[16] దానిని రాత్రి సమయానికెల్లా అతనికి ఇచ్చివేయాలి ఎందుకంటే పేదవాని శ్రమను మనం ఉంచుకోకూడదు (నిర్గమకాండము 22:26, 27 చూడు).

కొంచెం సేపు, మీ అంగీ కొరకు దావావేసిన ఒక యూదునిగా మిమ్ములను మీరు ఊహించుకొనండి. అయితే ఆశ్చర్యకరమైన రీతిలో, వ్యాజ్యమును అవతలి వ్యక్తి గెలువగా మీ అంగీని అతడికి ఇచ్చివేయాల్సివచ్చింది. యిప్పుడు యేసు ప్రభువు ఈ విధంగా అంటున్నారు, "దీన్ని బట్టి చింతింపకుండ, నీకున్న పై వస్త్రము కూడ ఇచ్చివేయుము" ఇది ఎంత కోపమును పుట్టిస్తుందో మీరు గమనించారా? ఏదేమైనా, కేవలం ఉదాహరణ యొక్క వివరాలపైనే దృష్టి పెడితే అసలు విషయం మరుగున పడుతుంది. ప్రభుని మనసులో అక్షరార్థ సన్నివేశం

లేదు. అనేక మంది యూదులు మూడు లేదా నాలుగు రకాల వస్త్రాలను ధరించుకుంటారు. కొంతమందిమాత్రం సింహపు చర్మాన్ని లేదా అటువంటి దానిని ధరిస్తారు (నిర్గమకాండము 28:42 చూడు). సాదారణంగా ఒక వ్యక్తి అంగీని, దాని పైన పై వస్త్రమును ధరిస్తాడు.[17] దీనిని పట్టియుంచేలా నడుముకి దట్టీ (belt)ని ధరిస్తాడు. ఒకవేళ ప్రభుని మాటలను అక్షరార్ధముగా తీసుకున్నట్టయితే, వ్యాజ్యమును ఒడిపోయిన వ్యక్తి తన అంగీని మరియు వస్త్రమును ఎదుటి వ్యక్తికి యిచ్చివేసి కేవలం దట్టితో లేదా చర్మపు వస్త్రంతో న్యాయస్థానంనుండి బయటకు రావలసియుంటుంది. కాని ప్రభువు చెప్తున్నది యిది కాదు.[18]

అయితే ఆయన ఏం చెప్తున్నారు? దీనిలో అంతర్లీనంగా ఉన్న ఏకైక సూత్రం యింతకు ముందు మనం చెప్పుకున్నదే: మీ వ్యక్తిగత *హక్కుల* కోసం ప్రాకులాడకండి. ఈ విషయంలో చట్టబద్ధ హక్కులను పాటించడం గురించి యియ్యబడింది. సందర్భం వేరైనా గాని, సహోదరుల మధ్య ఉన్న న్యాయపర విబేధాలను గురించి పౌలు ఈ విషయాన్ని తెలియజేస్తున్నాడు. "ఒకని మీద ఒకడు వ్యాజ్యమాడుట మీలో ఇప్పటికే ఒక లోపము, అంతకంటె అన్యాయము సహించుట మేలు కాదా? దాని కంటె మీ సొత్తులనపహరింపబడనిచ్చుట మేలు కాదా?" (1 కొరింథీయులకు 6:7). మేముంటున్న భాగంలో, ఆకారణ వ్యాజ్యములతో న్యాయస్థానములు నిండిపోతున్నాయి. ఏదో ఒక సాకుతో ప్రజలు డబ్బులు అడుగుతున్నారు. అర్కన్సస్‌లోని సియార్సీలో మేముంటున్నప్పుడు సామాజికపర విధులను బట్టి న్యాయస్థానానికి తరచూ నేను హాజరుకావలసి వచ్చేది. ప్రతిసారి కూడ వాది[19] తరపున వాదించే న్యాయవాది యిది పట్టులేని వ్యాజ్యముగా గుర్తించిన వెంటనే నేను వదిలివేయబడేవాడిని.

మన న్యాయపర హక్కులను గురించిన అవగహన మనకుండనక్కర్లేదని నేను చెప్పడం లేదు. ఒక రోమీయుడిగా పౌలు తన పౌరసత్వ న్యాయపర హక్కులను వినియోగించుకున్నాడు (అపొస్తలుల కార్యములు 16:35-39; 22:24-29ను చూడు). యెరూషలేములో మరణం తన కొరకు పొంచియుందని ఎరిగి, అక్కడికి వెళ్ళక కైసరు ఎదుటికి తేబడ్డాడు (అపొస్తలుల కార్యములు 25:9-12 చూడు). ఒక రోమా పౌరుడిగా ఇది తనకున్న హక్కు. కొన్నిసార్లు క్రీస్తు కొరకు, మన కుటుంబ క్షేమంకొరకు కృషిచేయాల్సిన పరిస్థితులు రావచ్చు. యిటువంటి సమయాల్లో మన న్యాయపర హక్కుల కొరకు మనం పోరాడాలి. మన స్వార్ధం చేత మనము ఈ పనిని చేయడం లేదు. మనం ప్రేమించే క్రీస్తును యితరులు విమర్శించేలా మన నడవడిక ఉండేకంటే న్యాయస్థానములో నింద మనమీద మోపబడడం ఎంతో మేలు.

(3) "రెండు మైళ్ళు వెళ్ళుము." యేసు యొక్క మూడవ ఉదాహరణ యిలా తెలియజేయ బడింది: "ఒకడు ఒక మైలు దూరము రమ్మని నిన్ను బలవంతము చేసిన యెడల వానితో కూడ రెండు మైళ్ళు వెళ్ళుము" (41 వచనం). మొదటి రెండు ఉదహారణలలో ఆధునిక విషయాలు చెప్పబడ్డాయి కాబట్టి సులువుగా అర్ధంచేసుకోవచ్చు గాని, దీనికి కొంత వివరణను ఇవ్వాలి. "బలవంతము" అను పదము (*angareuo*) అను గ్రీకు పదంనుండి వచ్చినది. దీనికి "పనిలోనికి బలవంతముగా చేర్చడం" అన్న అర్ధము ఉంది.[20] రాజు సైనిక వార్తాహారులు రాజు వార్తను చేరవేయుటకు స్థానిక ప్రజల సహకారాన్ని తీసుకునేవారు. పారసీక రాజుల కాలంనుండి యిది ఒక అలవాటుగా వస్తూ ఉంది. దీనినే రోమీయులు యింకా అభివృద్ధి పరిచారు. పాలాస్తీనా దేశములో రోమా సైనికులు యిదే విషయమై యూదులను బలవంతం చేసేవారు. యిదే పదం తరువాత మత్తయిలో కనిపిస్తుంది: "వారు వెళ్లుచుండగా కురేనీయుడైన

సీమోను అను ఒకడు కనబడగా ఆయన సిలువ *మోయుటకు అతనిని బలవంతము* చేసిరి" (27:32; నొక్కి చెప్పింది నాది). మన వాక్య ప్రకారం, రోమా సైనికుడొకడు తనతోనున్న సామాగ్రిని "ఒక మైలు దూరం" మోయుటుకు ఒక యూదుడ్ని బలవంతం చేశాడు. ఇది రోమీయుల మైలు దూరం. ఇది వెయ్యి అడుగుల దూరం లేదా వెయ్యి గజాల దూరం.[21] (అమెరికాలో ఒక మైలు అంటే 1760 గజాలు, 1600 మీటర్ల కంటే కొంచెం ఎక్కువ.)

మిమ్మల్ని మీరు యూదుల వ్యవసాయకునిగా ఊహించుకొనండి. బాగా ఎండగా ఉంది, కాని, పడమరనుండి మేఘాలు వస్తూ ఉన్నాయి. వాతావరణం మారి పోకముందే మీ పంటను కుప్పచేర్చడానికి మీరు కష్టపడుతున్నారు. మీరు సేదతీరుటకును ఆగగా, దూరంనుండి ఒక రోమా సైనికుడు వస్తూ కనిపిస్తున్నాడు. ఆ సమయంలో అతడ్ని చూడడం కాస్త చిరాకే! దేవుడు ఏర్పరచుకున్న ఈ పవిత్ర భూమిని తన్నుకుంటూ వస్తున్న అవిశ్వాసి సమీపిస్తున్నాడు. దగ్గరికి రాగానే చేతిలోని సామాగ్రిని నేలమీద పడేసి, "దీన్ని మోయ్" అని అరుస్తున్నాడు. మీ పనిని పదిలివేసి అతడి సామానును మోయడం కోసం వెళ్ళారు. ఆ సమాను మోసుకుంటూ, సైనికుడి వెనుకాలే వెళ్ళారు. ఆ సమయంలో మీకు ఎలా ఉంటుంది? కోపంగానా? ద్వేషంగానా? ఆఖరికి అతడు చెప్పిన ప్రాంతం వరకు దానిని మోసుకుంటూ వెళ్ళి దాన్ని అక్కడ చేర్చారు. తిరిగి వస్తు దారిలో సణుగుకుంటూ వచ్చారు. మీకు యిష్టం లేని పనిని మీరు చేయాల్సివచ్చింది. వర్షం రాకముందే పంటను కుప్ప వేయడం అసాధ్యం. అన్నిటి కంటే ముఖ్యముగా, ఒక అన్యునితో మీరు దగ్గరగా ఉండడంవలన మీరు మైలపడ్డారు.

ఇది జరిగిన సన్నివేశం, యిలాంటప్పుడు, "అతనితో కలిసి మరో మైలు వెళ్ళుమని" యేసు తెలియజేస్తున్నారు! "అతనితో కలిసి మరో *రెండు మైళ్ళు* వెళ్ళుమని"[22] ఆయన చెప్పినట్లు కొన్ని లేఖనాలలో ఉంది. కష్ట సాధ్యమైన పనులను అప్పగించి ఆయన తన శిష్యులను పరిశోధిస్తున్నారా? ఈ రెండు మైళ్ళు (రెండు లేదా మూడు మైళ్ళు) నడవడం అయ్యేపనేనా? మనసులో తిట్టుకుంటూ యింత దూరం నడువవలసిందేనా? కాదు, ఒక మంచి *వైఖరి* తన శిష్యులు కలిగియుండేలా ఆయన ప్రయత్నిస్తున్నారు. చెప్పబడిన విషయం కంటే మరింత ఎక్కువగా చేయగలిగే ఒక మంచి వైఖరిని ఆయన తన శిష్యులనుండి ఆశిస్తున్నారు. అలాగే, రెండవ మైళ్ళకు నడవడం సంతోషంగా, పూర్ణ హృదయంతో చేయాలి.[23] ఎవరో ఒక వ్యక్తి "రెండు మైళ్ళ దూరం వెళ్ళడం" గురించి ఈనాడు చెప్పుకుంటున్నాం. అతను చెప్పబడిన దూరంకంటే ఎక్కువ దూరం వెళ్ళాడు. ఎక్కువ పనిని చేశాడు అలాగే చేసిన పనిని సంతోషంగా చేశాడు.

దీని విషయమై ఎన్నో అన్వయింపులు మనసుకు వచ్చాయి. మన వివాహాలలో, గృహాల్లో మనం "రెండవ మైలు" కూడ వెళ్ళాలి. తమ పిల్లలకు ఆహారం, వస్త్రం యితర కనీస సౌకర్యాలను సమకూర్చగలిగి కూడ యింతకు ముందు ఏమీ ఇవ్వలేని తల్లిదండ్రుల గురించి మీరు ఏమనుకుంటున్నారు? మీ గురించి నాకు తెలియదు గాని, నా తల్లిదండ్రులు మాత్రం నా విషయంలో రెండు, మూడు, నాలుగు యింకా ఎన్నో మైళ్ళను దాటుకుంటూ వచ్చారు. అలాగే మన సంఘంలో కూడ సంఘస్థుల విషయంలో "రెండు మైళ్ళు దూరం" మనం వెళ్ళాలి. కొంతమంది క్రైస్తవులు మాత్రం పరలోకం వెళ్ళడానికి చేయవలసిన అతి కొద్దిదానిని ఎరిగియుండుటకు యిష్టపడతారు. అయితే మరికొంతమంది క్రైస్తవులు అన్వయింపును స్కూలు, పనిచేసే ప్రాంతానికి కూడ అన్వయించవచ్చును. కొంతమంది విద్యార్థులు, ఉద్యోగస్తులు

తమకు ఏ పని కేటాయించబడిందో అంతవరకే చేస్తుంటారు. అలాగే యింకొంతమంది అవసరమగు దానికంటే మరి ఎక్కువే చేస్తారు (కొలొస్సయులకు 3:23 చూడు). యిదే విషయం పౌరసత్వము మరియు యితర పనులను కూడ అన్వయిస్తుంది.

మరలా, దీనిలో అంతర్లీనంగా దాగియున్న విషయం యిదే – మనము మన గురించి మన స్వహక్కులను గురించి మాత్రమే ఆలోచించకూడదు. మనకంటే ముందు యితరులను ఉంచుకోవాలి. ఒకవేళ మనం అలాచేస్తే వారి మీద సత్‌ప్రభావాన్ని చూపించినవారమవుతాము యూద వ్యవసాయకుని విషయానికి మరలా తిరిగి వద్దాం. ఈ సన్నివేశాన్ని ఊహించండి, "యిప్పటికే చాలా దూరం నా సామానును మోసుకొచ్చావు. యింక చాలు, యింటికి వెళ్ళిపో" అని సైనికుడు మీతో అంటున్నాడు. సామానును అలాగే నేలమీద వదలివేయకుండా నవ్వుతూ "ఫర్వాలేదండి. దీనిని నగరపు ద్వారం వద్దకు తీసుకుని వస్తాను" అని అన్నారు. మీ మాటలకు సైనికుడు ఆశ్చర్యపోతాడు. ఏదేమైనా యిది మిమ్మల్ని ఒక మంచి వ్యక్తిగా నిలువబెడుతుంది.

(4) "యితరులకు సహాయం చేయడంలో విముఖుడవైయుండకుము." ప్రభువు చెప్పిన ఈ నాలుగవ ఉదాహరణ మొదటి మూడు ఉదాహరణలతో సరిపోతున్నట్లు అనిపించదు. మొదటి మూడు ఉదాహరణలు పగను తీర్చుకోవద్దన్న సందేశాన్ని యిస్తున్నాయి. మీ ముఖం మీద చెంప దెబ్బ తగిలినప్పుడు, మీరు వ్యాజ్యము వేయబడినప్పుడు లేదా మరో మైలు దూరం వెళ్ళుటకు బలవంతం చేయబడినప్పుడు ప్రతీకారం తీర్చుకొన చూడవద్దని ఇవి తెలియజేస్తున్నాయి. తరువాతదిగా యితరులకు సహాయం చేసే విషయం గూర్చిన ఉదాహరణను ఆయన తెలియజేస్తున్నాడు, "నిన్ను అడుగువానికిమ్ము, నిన్ను అప్పు అడుగగోరువానినుండి నీ ముఖము త్రిప్పుకొనవద్దు"[24] (42 వచనం).

మరోసారి, క్రైస్తవులను పరిహాసం చేసే, వారిని యిబ్బందికి గురిచేసే మరో ఆజ్ఞ యిక్కడ యియ్యబడింది. దీనిని ఏమీ పరిశీలించకుండా, ఉన్నది ఉన్నట్టుగా అక్షరార్థముగా దీనిని తీసుకున్నట్టయితే యితరులు మిమ్ములను ఏది అడిగినా గాని, అది ఎంత విలువైనదైనా గాని మీరు యిచ్చివేయాల్సి ఉంటుంది.

- మీ పిల్లలకు ఒక మంచి విందు కావాలని అడిగితే – దాన్ని వారికి యివ్వాలి.
- మీ యింటి ముందుగా వెళుతున్న ఒక వ్యక్తి దాని అందానికి ముగ్ధుడై పోయాడు. అతడు నీ యింటిని అడుగగా నీవు దానిని అతడికి యిచ్చివేయాలి.
- మరో వ్యక్తి నీ భార్యను చూచి ఆకర్షితుడయ్యాడు. ఆమె గురించి మిమ్ములను అడిగాడు కాబట్టి మీరు ఆమెను అతడికి యిచ్చివేయాలి.

ఈ ఆజ్ఞను అక్షరార్థముగా తీసుకుంటే ఎటువంటి విపరీతార్థ విషయములు జరుగుతాయో చూశారు కదా! కాబట్టి ప్రభువు యొక్క మాటలను ఈ కోణంలో నిర్వచించవచ్చు.

ప్రభుని మాటలు విపరీతార్థములను ఇయ్యకుండా, వాటిని సరిపరుచుకొనుటకు ఈ విషయాన్ని గమనించండి. కొండమీది ప్రసంగంలో తరువాతి భాగములలో ప్రార్థన గురించి ఆయన యిలా తెలియజేస్తున్నారు: "అడుగుడి మీకియ్యబడును; అడుగు ప్రతివాడును పొందును" (మత్తయి 7:7ఎ, 8). మరో సందర్భంలో, "నా నామమున మీరు నన్నేమి అడి గినను

నేను చేతును" (యోహాను 14:14) అని తెలియజేస్తున్నారు. ఈ వాగ్దానములనుబట్టి దేవుడు ప్రతి వాని ప్రార్థనను, అలాగే ఏ విజ్ఞాపన అయినా, దేని కోసమైనా అడిగితే ఆయన వాటిని అన్నిటినీ తీరుస్తాడా? పౌలు తన శరీరంలోని ముల్లును తొలగించుమని ప్రభువుని ముమ్మారు వేడుకున్నాడు. కానీ, దేవుడు అతడు మనవిచేసిన దానికి సానుకూలంగా స్పందించలేదు (2 కొరింథీయులకు 12:7-9). "మీరడిగినను మీ భోగముల నిమిత్తము వినియోగించుటకై దురుద్దేశముతో అడుగుదురు గనుక మీకేమియు దొరుకుట లేదు" (యాకోబు 4:3ఎ) అని యాకోబు తన పత్రికలో తెలియజేస్తున్నాడు. ఒకవేళ మనం దేవున్ని అడిగినవాటి విషయములో మన మనవిని దేవుడు వడగాస్తుంటే యితరులు మనలను అడిగిన వాటి విషయములోను మనం వారి మనవిని వడగట్ట వచ్చు.

మనవి చేయబడిన వాటిని విభిన్న విధాలుగా వ్యక్తం చేయవచ్చు. ఒక వ్యక్తి అడిగిన *వాటినన్నిటిని* యిస్తానని యేసు ప్రభువు చెప్పలేదు.[25] ఒక వ్యక్తి అడిగిన వాటినన్నిటికి అతడికి యిస్తే అతడిని నాశనానికి నడిపినవాడవుతాడు. అలాగే యితరులు మనలను ఏదైతే అడిగారో *దాన్నే* వారికి యివ్వాలని కూడ ఆయన చెప్పలేదు. ఒక వ్యక్తి తనకు ఆహారం లేదా ఒక పని అవసరమయితే అతడు డబ్బును అడుగవచ్చు.[26]

మనవులను డి. ఏ. కార్సన్ ఈ విధంగా క్లుప్తీకరిస్తున్నాడు, "ఒక విశ్వాసి ప్రేమ మరియు వాక్యము కంటే యింకా ఏమివ్వగలడు."[27] మన యొక్క దాతృత్వంలో ప్రేమ ఎలాంటి పరిస్థితులను చూపుతుంది? అయితే ప్రేమ యిలా చెబుతుంది, యితరులు బాధపడేంత, నొప్పించేదిగా ఉంటే దేనిని నేను యివ్వను. (మన పిల్లలు అడిగే విందుకు యిది సమాధానం చెబుతుంది.)

అయితే వాక్యం ఎలాంటి పరిమితులను విధిస్తుంది? వాక్య వ్యాఖ్యానంలోని ప్రాథమిక సూత్రం అయిన ఒక విషయాన్ని గమనించండి: "ఒక వాక్యం మరో స్థిర వాక్యంతో విభేధించేలా ఉండే విధంగా దానిని అస్పష్ట వ్యాఖ్యానం చేయకూడదు." మన దాతృత్వం గురించి వాక్యంలోనున్న స్థిర వాక్యాలు యిలా తెలియజేస్తున్నాయి. ఉదాహరణకు, మనం చేసే దానము మరొకనిని బద్ధకస్తులుగా చేయకూడదు.[28] "ఎవడైనను పనిచేయనొల్లని యెడల వాడు భోజనము చేయకూడదని మీకు ఆజ్ఞాపించితిని" (2 థెస్సలొనీకయులకు 3:10). అలాగే, మన యొక్క దాతృత్వము మన కుటుంబ అవసరాలను తీర్చుటలో మనలను ఆటంకపరిచేదిగా ఉండకూడదు. "ఎవడైనను స్వకీయులను, విశేషముగా తన యింటివారిని, సంరక్షింపక పోయిన యెడల వాడు విశ్వాస త్యాగము చేసినవాడై అవిశ్వాసికన్నా చెడ్డవాడైయుండును" (1 తిమోతి 5:8).

42వ వచనం ఏ విపరీతార్థాలను యివ్వడం లేదని చెప్పడానికి యిది చాలు. ఈ ఉదాహరణ యిదివరకటి వాటితో ఏ విధంగా పొందికగా ఉంటుంది? యిక్కడ కూడ, మనం స్వార్థపరులమైయుండకూడదన్న విషయం చెప్పబడింది. మనం మనకు సంబంధించిన వారి మీదనే దృష్టియుంచకూడదు. అలా చేస్తే వాటిని మనం కోల్పోతాము.[29] అవసరతలోనున్న వారికి ఇయ్యుటకు మనం సిద్ధంగా ఉండాలి.

ఈ నేపథ్యంలో మనలను అగౌరవపరచిన వారి యెడల మనం ఎలా ప్రతిస్పందించాలన్న విషయాన్ని యేసు ప్రభువు తెలియజేస్తున్నారు. వారికి మనం ఏం చేయాలి? వారికి ఏం అవసరమో దాన్ని మనం ఇవ్వాలి. ఈ ఉదాహరణ నకారాత్మక భావంనుండి సానుకూల

భావానికి మనల్ను నడిపిస్తుంది. మనం ప్రతీకారేచ్ఛ లేకుండా అగౌరవాన్ని సహించడం మాత్రమే కాదు బలహీనులను ఆదుకోవాలి (రోమీయులకు 12:19-21 చూడు). మనలను హింసించిన వారి యెడల సానుకూలంగా స్పందించడం గురించి తరువాతి పాఠంలో సవిస్తారంగా చర్చించబడుతుంది.

మత్తయి 5:42 వాక్య భాగం యొక్క అన్వయింపును కేవలం మన శత్రువులకే పరిమితం చేయకూడదు. ఇది నాది, నాకు సంబంధించినంత వరకు మాత్రమే నేను పట్టించుకుంటాను అని అనుకునే కంటే, నాకు కలిగియున్నది యితరులతోనూ పంచుకుంటాను అన్న సూత్రాన్ని మనం నేర్చుకోవాలి. మన గుప్పిలిని మూసుకొని, పిసినారితనంగా ఉండడం కంటే, విశాల హృదయంలో దాతృత్వంతో ఉండడం మేలు. "ఈ లోకపు జీవనోపాధిగల వాడైయుండి తన సహోదరునికి లేమి కలుగుట చూచియు అతని యెడల ఎంతమాత్రమును కనికరము చూపని వానియందు దేవుని ప్రేమ యేలాగు నిలచును?" (1 యోహాను 3:17) అని యోహాను ప్రశ్నిస్తున్నాడు. "కాబట్టి మనకు సహాయము దొరికిన కొలది అందరి యెడలను విశేషముగా విశ్వాస గృహమునకు చేరినవారి యెడలను మేలు చేయుదము" (గలతీయులకు 6:10) అని పౌలు వ్రాస్తున్నాడు. యితరులను మనతో పాటు కనికరించే "ప్రధాన యాజకుడు" మనకున్నాడు (హెబ్రీయులకు 4:15); మనము కూడ యిరులను కనికరించుదము.

## ముగింపు

మనం అగౌరపర్చబడినప్పుడు మనం ఏంచేయాలి? మనం ఈ మూడు విధాలుగా ప్రతి స్పందించవచ్చు:[30]

- *అపరిమిత పగ.* యిది అడవిలోని న్యాయ విధి, లోకం యొక్క తీరు.
- *పరిమితి పగ.* మోషే ధర్మశాస్త్ర మరియు న్యాయము, చట్టము యొక్క విధి.
- *అపరిమిత సత్ప్రవర్తన.* యిది ప్రేమ యొక్క విధి. క్రీస్తు యొక్క విధానం.

మూడవ ప్రతిస్పందన మన పాఠములో వివరించబడింది. తరువాత పాఠములో మరి విస్తారంగా చర్చించబడుతుంది.

మత్తయి 5:38-42 వాక్య భాగంలో యేసు మాటల యొక్క ఖచ్చిత భావాన్ని ఈ పాఠములో అర్థం చేసికొనుటకు ఎంతగానో ప్రయత్నించాం. కాని దీనికి లోబడడం కంటే దీనిని అర్థం చేసుకోవడం పదింతలు సులభం. నేను భావించినట్లే మీరు కూడ యిదే విషయాన్ని భావించియుంటారనుకుంటాను: మత్తయి 5వ అధ్యాయాన్ని మరింతగా చూచే కొద్ది క్రీస్తు మననుండి కోరుకుంటున్న అవశ్యకతలు మరింత జటిలంగా అన్పిస్తుంటాయి. కాబట్టి మరింతగా దేవుని సహాయాన్ని కోరుకోవాలి. ఒకవేళ మీకు దేవునియందు నమ్మకం ఉండి, వాక్యానుసారంగా మీరు బాప్తిస్మం పొందకపోతే, మీరు వెంటనే వాక్య ప్రకారం బాప్తిస్మం పొందాలి, అప్పుడు దేవుని ఆత్మ మీకు సహాయం చేస్తాడు (అపొస్తలుల కార్యములు 2:38; రోమీయులకు 8:13, 26 చూడు). ఒకవేళ మీరు క్రైస్తవులు అయితే, దేవుని మీద ఆనుకుని యుండండి, ఆయన మిమ్ములను ఎన్నడూ విడువడు ఎడబాయడు (హెబ్రీయులకు 13:5బి, 6).

## సూచనలు

[1]లూకా 6:27–36లోని మైదానము నందలి ప్రసంగంలోనూ యిదే విషయం ప్రస్తావించబడింది. దీనిని మత్తయి 5:38–48తో పోల్చి చూడు. పోలికలు, వ్యత్యాసాలను పోల్చి చూడు. [2]D. Martyn Lloyd-Jones, *Studies in the Sermon on the Mount.* vol. 1 (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1959), 273. [3]యిటువంటి పాత నిబంధన ఉదాహరణ కొరకు నిర్గమకాండము 21:26, 27 చూడు. [4]David Hill, *The Gospel of Matthew*, New Century Bible Commentary series (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1972), 127. [5]"ఎదురించడం" అనుమాట సరియుక్త గ్రీకు పదమైన (*anthistemi*) నుండి వచ్చింది. దీనికి "వ్యతిరేకముగా ఉంచడం" (*histemi* ["నిలువడం"] అని అర్థం. దీనికి ముందు anti ["వ్యతిరేకంగా"]) అను పదం ఉంటుంది (W. E. Vine, Merrill, F. Unger, William White, Jr., *Vine's Complete Expository Dictionary of Old and New Testament Words* [Nashville: Thomas Nelson Publishers, 1985], 528). [6]గ్రీకు మూలములో "దుష్టుని (విశేషణం) (ponhro÷ß, *poneros*) అను మాట నామవాచకం లేకుండా ఉపయోగించబడింది. యిదే మత్తయి 5:39లోనూ ఉపయోగించబడింది. KJVలోను "దుష్టుని ఎదిరింపక" అని ఉంది. సాధారణంగా చెప్పాలంటే దుష్టుని ఎదిరించాలి. దుష్టుడు (సాతానుడు) అనుమాట దీనిని ఉద్దేశించినది కాదు (యాకోబు 4:7 చూడు). నేపథ్య ప్రకారం, దుష్టుడు అంటే, ఒకనిని చెంపదెబ్బకొట్టువాడు, అంగీని లాగుకొనువాడు, శిష్యుని ఎదురించువాడు అని అర్థం. [7]అపొస్తలుల కార్యములు 16:35–39; 23:3; 25:9, 10లను గమనించండి. ప్రతి సందర్భంలోను తను అగౌరవపరచబడ్డాడన్న ఉద్దశంతో గాక తన సూత్రం ప్రకారం ఎదురించాడు. [8]యిదే పాఠములో నాలుగవ ఉదాహరణ (యితరులకు యివ్వడం) గురించి నేర్చుకుంటాం. యిది మిగిలిన వాటితో సరిగ్గా పొందికయై ఉంటుంది. [9]B. W. Johnson, *People's Testament* (St. Louis: Christian Publishing Co., 1891) (http.//www.ccel.org/ccel/johnson_bw/pnt.pnt0105.html; Internet; accessed 30 May 2008). [10]చెంపదెబ్బ గురించి పేరొక్కనబడ్డ మరో రెండు వాక్య భాగాలు 1 రాజులు 22:24 మరియు విలాప వాక్యములు 3:30; 2 కొరింథీయులకు 11:20లో కూడ ముఖము మీద కొట్టడం గురించి పేర్కొనబడింది.

[11]దీని గురించి విపులంగా చర్చించడానికి యిది సందర్భం కాదు. దేన్నయినా పరిష్కరించుటకు మీ పిల్లలకు పిడికిలి బిగించడాన్ని నేర్పిస్తే వారు పెద్దవారయిన తరువాత ఏమి చేస్తారు? [12]న్యాయస్థాన విషయాల గురించి మత్తయి 5లోని 22 మరియు 25 వచనాలను గమనించండి. [13]KJV కూడ "కోటు" మరియు "అంగీ" అను పదాలను ఉపయోగించి యిదే పని చేసింది. [14]Vine, 105. [15]Ibid. [16]ఈ నేపథ్యంలో "ప్రమాణం" అంటే, యివ్వబడిన అప్పు కొరకు పెట్టే "హామీ" (*The American Heritage Dictionary*, 4th ed. [2001], s.v. "pledge"). [17]"వ్యాజ్యము వేయడం" అంటే ఈ తతంగమంతయు న్యాయస్థాన పరిధిలోనే జరుగునని అందరూ భావిస్తారు. ఏదేమైనా, ఈ వాక్య భాగమునకు అర్థం ఏమిటంటే, వ్యాజ్యమును ఓడి పోయిన వ్యక్తి అంగీని యిచ్చివేసిన విధంగానే రెండవ వస్త్రమును కూడా యిచ్చివేయాలి. [18]నగ్నత్వం (సరిపడ వస్త్రధారం లేకపోవడం) అన్నది అవమానమునకు చిహ్నమని వాక్యం తెలియజేస్తుంది (యెషయా 47:3; ప్రకటన 3:18). [19]వాది అంటే ఒకనిమీద మొదటిగా వ్యాజ్యము వేసినవాడు అని అర్థం. [20]Vine, 117.

[21]"మైలు" అనేది *mille* అను లాటిన్ మాటనుండి వచ్చింది. దీనికి "వెయ్యి" అని అర్థం. [22]D. A. Carson, "Matthew," *The Expositor's Bible Commentary,* vol. 8 (Grand Rapids, Mich.: Regency Reference Library, Zondervan Publishing House, 1984), 156. [23]మన యిష్టపూర్వకంగా మరియు సంతోషకరంగా యివ్వడం గురించి పోలిక చెప్ప బడింది (2 కొరింథీయులకు 9:7ను చూడు). [24]42వ వచనంలో రెండు ఆజ్ఞలున్నాయని కొంతమంది నమ్ముతారు. కాని యిక్కడ ఒకే ఆజ్ఞలోని రెండు భావాలుగా చెప్పబడింది. [25]Lloyd-Jones, 167. [26]ఒకసారి ఒకడు స్వర్గము గురించి యేసును అడుగగా ఆయన అతడి విన్నపాన్ని మన్నించలేదు గాని అతడికి అవసరమైన పిసినారితం గురించిన బోధను అతడికి బోధించాడు. (లూకా 12:13–21 చూడు.) [27]కార్సన్ 157. ఈ వ్యాఖ్యను చేయునప్పుడు కార్సన్ మనసులో ప్రభుని నాలుగు ఉదాహరణలున్నాయి. [28]"అన్ని విధాల సహాయాన్ని అందుకునే ఒక వ్యక్తికంటే, ఎటువంటి సహాయం లేని పదిమందికి సహాయం చేయడం మేలనే" ఒక పాత సామెతను మనసులో పెట్టుకోండి. [29]"మీ స్వాధీనాస్థులను కేవలం తేలికగా పట్టి ఉంచండి" అని ఒకరు అన్నారు. [30]Adapted from Lloyd-Jones, 171-74.